ప్రజాశక్తి
సోమవారం 13 అక్టోబర్ 2025

మాట్లాడుతున్న ఎస్పి

ఆదోని సమగ్రాభివృద్ధికి పోరాడుదాం

- సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్

ప్రజాశక్తి - ఆదోని

నిర్లక్ష్యానికి గురై అభివృద్ధిలో వెనుకబడ్డ ఆదోని ప్రగతి కోసం నిరంతర ఉద్యమానికి కలిసి రావాలని సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ కోరారు. పార్టీ పట్టణ కార్యదర్శి లక్ష్మణ్ అధ్యక్షతన ఆదోని ఎన్‌జిఒ హోమ్‌లో 'ఆదోని సమగ్రాభివృద్ధి'పై సదస్సు నిర్వహించారు. గౌస్ దేశాయ్ మాట్లాడుతూ కర్నూలు జిల్లాలోని 160 సంవత్సరాలు చరిత్ర కలిగి, పత్తి, వేరుశనగ పంటలకు ప్రసిద్ధిగాంచిన ఆదోనిలో ఒక్కపుడు మూడు స్పిన్నింగ్ మిల్లులు, ఐదారు పెద్ద ఆయిల్ ఫ్యాక్టరీలు, వందల సంఖ్యలో జన్నింగ్, ప్రెస్సింగ్ ఫ్యాక్టరీలు ఉండటంతో వేలాదిమందికి ఉపాధి దొరికేదన్నారు. ఒకప్పుడు ఆదోని నిత్య కళ్యాణం మాదిరిగా కలకలాడుతూ రెండవ ముంబాయిగా ప్రసిద్ధిగాంచిందన్నారు. ఆదోని నేటి పాలకుల నిర్లక్ష్యంతో అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని తెలిపారు. పాలకులు మారుతున్నారే తప్ప ఇక్కడ పరిస్థితులు మాత్రం అలాగే మిగిలాయన్నారు. ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాల వల్ల ఎన్నికైన ప్రజాప్రతినిధుల్లో చిత్తశుద్ధి కరువై పరిశ్రమలు మూతపడటంతో వేలాది మంది ఉపాధి కోల్పోయారని ఆందోళన వ్యక్తం చేశారు. కొత్త పరిశ్రమల ఏర్పాటుకు కనీసం ప్రయత్నం కూడా చేసిన పాపాన పోలేదని, మార్పు ఎలా వస్తుందని నిలదీశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తి అయినప్పటికీ ఆదోని పట్టణ సమస్యలు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయన్నారు. సమస్యల పరిష్కారం కోసం ప్రజలే నడుము బిగించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఇప్పటికైనా ఆదోని పట్టణ సమగ్ర అభివృద్ధి కొరకు పాలకులు ప్రయత్నం చేయాలన్నారు. ప్రజాధనంతో నిర్మాణం జరిగిన మెడికల్ కళాశాలను నిర్లక్ష్యం చేయడం తగదన్నారు మెడికల్ కళాశాల నిర్మాణం, నిర్వహణ, ప్రభుత్వమే నిర్వహించాలన్నారు. ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో స్త్రీల, చిన్నపిల్లల ఆసుపత్రులను జిల్లా స్థాయి హాస్పిటల్‌గా అప్ గ్రేడ్ చేస్తూ అన్ని రకాల జబ్బులకు వైద్యుల నియమించి, మెరుగైన వైద్య పరికరాలు ఏర్పాటు ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో సిటి స్కానింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం పనులు వెంటనే ప్రారంభించి వ్యాపారులకు కేటాయించి ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణం నడిబొడ్డున ఉన్న కూలడానికి సిద్ధంగా ఉన్న పాత ఫ్లై ఓవర్ బ్రిడ్జి స్థానంలో కొత్త బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలన్నారు. పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ కోసం పెండింగ్‌లో ఉన్న బైపాస్ రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. మంచినీటి సమస్య పరిష్కారానికి ప్రధానంగా మరో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మించాలన్నారు. పట్టణంలో ఆహ్లాదకరమైన పార్కులు ఏర్పాటు చేయాలన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వెంకటేశులు, సీనియర్ నాయకులు రామాంజనేయులు, సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు గోపాల్, తిప్పన్న, ముక్కన్న, పట్టణ కమిటీ సభ్యులు వీరేష్, వెంకటేష్, నాగరాజు, అజీమ్ ఖాన్, నాగేంద్ర, కృష్ణమూర్తి, శ్రీనివాసులు, మునెప్ప పాల్గొన్నారు.

ఆదోని పట్టణ సమగ్రాభివృద్ధికై
సి.పి.యం పార్టీ ఆధ్వర్యంలో
సదస్సు
CPM

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్

నేటి ప్రజా సమస్యల పరిష్కార వేదిక గ్రీవెన్స్ కార్యక్రమం రద్దు

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టర్

జిల్లాలో సోమవారం నిర్వహించనున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక గ్రీవెన్స్ కార్యక్రమం రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అధికారులు, ఉద్యోగులు ప్రధానమంత్రి పర్యటన ఏర్పాట్లలో నిమగ్నమైనందున జిల్లాలో నిర్వహించనున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం)కార్యక్రమం రద్దయిందని, ప్రజలు ఈ విషయం గమనించగలరని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

ప్రధాని పర్యటనకు 7,300 మంది పోలీసులు

-సెక్టార్ , లైజనింగ్ ఆఫీసర్లకు ఎస్‌పి దిశా నిర్దేశం

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్

ఈ నెల 16న కర్నూలులో ప్రధాని మోదీ పర్యటన నేపథ్యంలో 7300 మంది పోలీసులతో పకడ్బందీ భద్రత ఏర్పాట్లను చేపట్టినట్లు జిల్లా ఎస్పి విక్రాంత్ పాటిల్ తెలిపారు. పకడ్బందీ భద్రతా ఏర్పాట్ల గురించి బందోబస్తు నిమిత్తం వచ్చిన సెక్టార్ , లైజనింగ్ పోలీసు అధికారులతో ఆదివారం కర్నూలు , ఓర్వకల్లు మండలం , నన్నూరు దగ్గర ఉన్న రాగమయూరి గ్రీన్ హిల్స్‌లో బహిరంగ సభ ప్రాంతం దగ్గర ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూంలో సమీక్ష సమావేశాన్ని నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. అనంతరం పోలీసు అధికారులతో ఎస్పి విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ... పార్కింగ్ ప్రదేశాలు, రూట్ డైవర్షన్స్ గురించి , జియో గ్రాఫికల్ మ్యాప్‌ను చూపిస్తూ వివరించారు. ప్రధాని పర్యటన నిమిత్తం 7,300 పోలీసు బలగాలను బందోబస్తుకు వినియోగిస్తున్నామన్నారు. ప్రధాని మోదీ పర్యటించే ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టామన్నారు. ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం ఏరియాల నుండి వచ్చే వాహనాలను నాగాలాపురం దగ్గర ట్రాఫిక్ మళ్ళింపు చేయాలన్నారు. బస్తిపాడు, చిన్నటేకూరు , తడకన పల్లి మీదుగా నన్నూరు రాగమయూరి దగ్గర ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రదేశాలకు చేరుకునే విధంగా చేయాలన్నారు. డోన్, ప్యాపిలి, తుగ్గలి, పత్తికొండ ఏరియాల నుండి వచ్చే వాహనాలు నేషనల్ హైవేకు వచ్చి తడకన పల్లి మీదుగా నన్నూరు, రాగమయూరి దగ్గర ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రదేశాలకు చేరుకునే విధంగా చేయాలన్నారు. కర్నూలు మీదుగా నుండి వచ్చే వాహనాలు నన్నూరు టోల్‌గేట్ దాటి తర్వాత రాగమయూరి దగ్గర ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రదేశాలకు చేరుకునే విధంగా చేయాలన్నారు. నంద్యాల, ఆళ్ళగడ్డ,బనగానపల్లె,ఏరియాల నుండి వచ్చే వాహనాలు నంద్యాల రోడ్డులో వచ్చి రాగమయూరి పార్కింగ్ దగ్గర ఏర్పాటు చేసిన ప్రదేశానికి చేరుకునే విధంగా చేయాలన్నారు. ఆయా నియోజక వర్గాల నుండి వచ్చే వాహనాలను ఏవిధంగా పార్కింగ్ ప్రదేశాలకు మళ్ళింపు చేయాలనే విషయాల పై చర్చించి పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. నియోజక వర్గాల వారిగా కేటాయించిన పార్కింగ్ ఏరియాలలలో వారి వాహనాలను ఏర్పాటు చేసుకునే విధంగా చేయాలన్నారు. పార్కింగ్ ఏరియాలలో ఇండికేషన్ సైన్ బోర్డ్సు ఏర్పాటు చేశామన్నారు. ఆఫీసియల్స్ కు నెంబర్ 2 పార్కింగ్ ఏరియాను కేటాయించామన్నారు. ట్రాఫిక్ డైవర్షన్స్ గురించి, వివిఐపి కాన్వాయ్ రూట్ , ఏయే నియోజక వర్గాల నుండి ఎంత మంది ప్రజలు వస్తున్నారనేది, క్రౌడ్ కంట్రోల్ ఏవిధంగా చేయాలనే విషయాల గురించి బందోబస్తు వివరాల గురించి, జియోగ్రాఫికల్ మ్యాప్‌ను చూపిస్తూ వివరిస్తూ దిశా నిర్దేశం చేశారు. ప్రతి సెక్టార్ ఇంచార్జ్ పోలీసు ఉన్నతాధికారులకు, లైజనింగ్ ఆఫీసర్లకు పలు సూచనలు చేశారు. వివిఐపిల పార్కింగ్, వివిఐపిల గ్యాలరీల దగ్గర అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆయా జిల్లాల ఎస్‌పిలు పరమేశ్వర్‌రెడ్డి, దేవరాజ్, మాధవ్ రెడ్డి, దీపికా పాటిల్, జి.కృష్ణకాంత్,కృష్ణకాంత్ పటేల్, శ్రీనివాసరావు, మణికంఠచందవోలు, దీరజ్‌కును బిల్లి, షెల్కేనచికేత్ విశ్వనాథ్, చక్రవర్తి, లక్ష్మీ నారాయణ, ట్రైనీ ఐపిఎస్‌లు, అడిషనల్ ఎస్పీలు , డిఎస్‌పిలు , సిఐలు, ఆర్‌ఐలు ఎస్ఐ పాల్గొన్నారు.

బీసీలకు 44 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

బీసీలకు 44శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ పోతల నాగరాజు డిమాండ్ చేశారు. ఆదివారం కర్నూలు బీసీ భవన్ లో బీసీ సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ పోతుల నాగరాజూ మాట్లాడుతూ రిజర్వేషన్లు అనేవి రాజ్యాంగబద్ధంగా బీసీలకు కల్పించిన హక్కుఅని పేర్కొన్నారు. నేటి ప్రభుత్వాలు వాటిని తుంగలో తొక్కి వారి అవసరాల కోసం బీసీలను వాడుకొని వదిలేస్తున్నారన్నారు. రాజ్యాంగబద్ధంగా రావాల్సిన బీసీ రిజర్వేషన్లను ఆయా పార్టీలు మోసం చేస్తున్నాయని విమర్శించారు. దేశ రాష్ట్ర జనాభా దామాషా ప్రకారం ప్రతి కులానికి రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం బీసీ,ఎస్సీ,ఎస్టీ మైనార్టీ ఐక్యవేదిక అధ్యక్షులు శేషపని మాట్లాడుతూ రాజ్యాంగబద్ధంగా రావాల్సిన రిజర్వేషన్లు నేడు పోరాటం చేస్తే తప్ప వచ్చే పరిస్థితి లేదన్నారు. ఈ సమావేశంలో బిసి సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి నక్కల మిట్ట శ్రీనివాసులు, అర్ఇఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నారాయణ నాయక్ అర్ఇఎఫ్ అనంతపురం జిల్లా అధ్యక్షులు రాజా రమేష్ ఆర్‌పిఎస్ రాష్ట్ర యూత్ అధ్యక్షులు పెరుగు శివకృష్ణ, వడ్డెర సంఘం అధ్యక్షులు భక్తుల లక్ష్మీకాంతయ్య, దూదేకుల సంఘం నాయకులు ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ల పరిరక్షణ మరియు
రిజర్వేషన్ల
RPS
12-10-2025

మాట్లాడుతున్న డాక్టర్ పోతుల నాగరాజు

పెండింగ్ ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి

- కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి

సభా వేదిక ఏర్పాట్ల మంత్రి డిజి భరత్ పరిశీలన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ప్రధాన మంత్రి పర్యటనపెండింగులో ఉన్న ఏర్పాట్లను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి అధికారులను ఆదేశించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జిల్లాలో పర్యటించనున్న సందర్భంగా నన్నూరు టోల్ గేట్ దగ్గర ఉన్న రాగమయూరి వద్ద సభ ప్రాంగణం, హెలిప్యాడ్ ఏర్పాట్లను కలెక్టర్, ఎస్పి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సభ ప్రాంగణం, హెలిప్యాడ్ ఏర్పాట్లను పరిశీలిస్తూ ప్రధాని వచ్చే దారిలో బ్యారికేడింగ్ పనులను ఈరోజు లోపు పూర్తి చేయాలని కలెక్టర్ ఆర్ అండ్‌బి అధికారులను ఆదేశించారు. పార్కింగ్ ప్రదేశంలో పెండింగులో ఉన్న పనులను, ఇతర రోడ్ల నిర్మాణ పనులను కూడా పూర్తి చేయాలన్నారు. జిల్లాఎస్‌పి విక్రాంత్ పాటిల్ సభ ప్రాంగణం, హెలిప్యాడ్ ఏర్పాట్లను పరిశీలిస్తూ సెక్యూరిటీ పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పోలీస్ అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఐఎఎస్ అధికారులు భరత్ గుప్తా, శౌర్యమాన్ పటేల్, అన్నమయ్య జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, మదనపల్లె సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, రాజంపేట సబ్ కలెక్టర్ భావన, ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువంశీ, తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి టీజీ భరత్

ప్రధాని మోడీ పర్యటన ఏర్పాట్ల పరిశీలన

ఈ నెల 16న ప్రధానమంత్రి జిల్లాలో పర్యటించనున్న సందర్భంగా ఏర్పాట్లను రాష్ట్ర పరిశ్రమలుశాఖ మంత్రి టీజీ భరత్ పరిశీలించారు.. ఇప్పటికే ఏర్పాట్లు అని కూడా దాదాపుగా పూర్తి అయ్యాయని అన్నారు... ప్రధాన మంత్రి పర్యటనను విజయవంతంగా చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. మంత్రి వెంట ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, కర్నూలు మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధానమంత్రి మోడీ పర్యటన షెడ్యూల్

ఈనెల 16న ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పర్యటన షెడ్యూల్ ఖరారు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం అందింది. 16న గురువారం ఉదయం 7:50 గంటలకు ప్రధాని మోదీ ఢిల్లీనుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరతారు. ఉదయం 10:20 గంటలకు కర్నూలు ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి 10:25 గంటలకు ప్రత్యేక హెలికాప్టర్‌లో సున్నిపెంట హెలిప్యాడ్‌కు వెళ్తారు. సున్నిపెంటలో 11:05 గంటలకు చేరుకోని, రోడ్డు మార్గంలో శ్రీశైలం భ్రమరాంబ గెస్ట్ హౌస్‌కి 11:45 గంటలకు చేరుకుంటారు. భ్రమరాంబ మల్లికార్జున స్వామిని దర్శించుకుంటారు. (సుమారు 50 నిమిషాలు పూజలు). తరువాత మధ్యాహ్నం 12:45 గంటలకు భ్రమరాంబ గెస్ట్ హౌస్‌కు తిరిగి వస్తారు. 1:25 గంటలకు సున్నిపెంట హెలిప్యాడ్ నుంచి బయలుదేరతారు. మధ్యాహ్నం 2:30 గంటలకు , నన్నూరు గ్రామంలో జిఎస్‌టి విజయోత్సవ సభలో పాల్గొంటున్నారు. అక్కడ పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేస్తారు. సాయంత్రం 4:00 గంటలకు బహిరంగ సభలో పాల్గొంటారు. అక్కడ నుండి సాయంత్రం 4:45 గంటలకు కర్నూలు ఎయిర్‌పోర్ట్ నుంచి ఢిల్లీకి బయలుదేరతారు. ఈ పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఇతర ముఖ్యమైన రాజకీయ నాయకులు పాల్గొంటారు.

సమస్యలను తెలుసుకుంటున్న నాయకులు

లైట్లు వెలగవు..ఫ్యాన్లు తిరగవు...

- తాగునీటి మోటార్లు పనిచేయడం లేదు

- లో వోల్టేజీతో ఇబ్బంది పడుతున్న ప్రజలు

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

నగర శివారులో సంతోష్ నగర్ రహమత్ నగర్ లోని కొన్ని ప్రాంతాల్లో లోవోల్టేజీ సమస్య వల్ల లైట్లు వెలగడం లేదు. ఫ్యాన్లు తిరగడం లేదని, కొన్ని సందర్భాల్లో తాగునీటి మోటార్లు పనిచేయడం లేదని స్థానిక కాలనీల ప్రతినిధులు ఆర్.షఫీవుల్లా, గులాం హుస్సేన్, ఆర్.రోషన్ జమీర్, పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం సంతోష్ నగర్ రహమత్ నగర్ కాలనీలలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పరిశీలనకు వచ్చిన లైన్‌ఇన్‌స్పెక్టర్ నరసింహులుకు విద్యుత్ సమస్యలను తెలిపారు. విద్యుత్ స్తంభాల కొరత, లో వోల్టేజ్ సమస్య ఉన్న ప్రాంతాలను ఆయన దృష్టికి తెచ్చారు. వారు మాట్లాడుతూ 25 నుండి 30 సంవత్సరాలనుంచి ఈ ప్రాంతంలో నివసిస్తున్నామని, నిబంధనల ప్రకారం విద్యుత్ స్తంభాలు అవసరమైన విద్యుత్ సరఫరా కాక, లైట్లు, ఫ్యాన్లు, విద్యుత్ మోటార్లు కొన్ని సందర్భాల్లో కాలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. లైట్లు వెలగక, పాములు, తేళ్లకు భయపడి తిరుగుతున్నామని అన్నారు. విద్యుత్ ఇంజనీర్ల దృష్టికి తీసుకెళ్లి విద్యుత్ స్తంభాలు లో వోల్టేజ్ సమస్య పరిష్కరిస్తామని లైన్ ఇన్‌స్పెక్టర్ హామీ ఇచ్చారు. కాలనీలో పర్యటించి విద్యుత్ సమస్యలను తెలుసుకొని హామీ ఇచ్చిన విద్యుత్ శాఖ లైన్ ఇన్‌స్పెక్టర్‌కు అభినందనలు తెలిపారు. ఎస్. అయూబ్, కెఎండి. సులేమాన్, సి.సత్యన్న, ఎండి యూనూస్, కె.శ్రీనివాసులు, ఎస్. అన్వర్‌బాష, ఇ.ఆంజనేయులుగౌడ్, ఎస్. మున్వర్‌బాష పాల్గొన్నారు.

బాలికల విద్యతోనే సమాజాభివృద్ధి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్ : బాలికల అభివృద్ధితోనే సమాజం నిజమైన అభివృద్ధి సాధిస్తుందని ఐసిడిఎస్ సూపర్వైజర్ మల్లేశ్వరి అన్నారు. కర్నూలు మండలం ఉల్చాల గ్రామంలో అంగన్వాడి కార్యకర్తల ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా బేటి బచావో బేటి పడావో కార్యక్రమాన్ని కర్నూలు మండలం ఉల్చాల గ్రామంలో నిర్వహించారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ మల్లేశ్వరి మాట్లాడుతూ చదువు పట్ల ఆసక్తి కనబరచాలన్నారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ...ఈనెల 16,17 తేదీలలో జరిగే పోషణ్ మాగ్రామం కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ వినియోగం గురించి వివరించారు. అనంతరం కిశోర బాలికలకు స్వేచ్ఛ ఆటలు ఆడించారు. మ్యూజికల్ చైర్స్ ,స్కిప్పింగ్ లాంటి ఆటలు ఆడిచ్చి ఫస్ట్,సెకండ్,థర్డ్ బహుమతులు అందజేశారు. అంగన్వాడి కార్యకర్తలు మాదక్క, లక్ష్మి, ప్రమీల దేవి, భారతి, లింగమ్మ, జయలక్ష్మి, పరిమళ పాల్గొన్నారు.

స్వచ్ఛ భారత్, స్వచ్ఛాంధ్ర ఎక్కడ..?

- సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పి.నిర్మల

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు కార్పొరేషన్ పరిధిలో స్వచ్ఛభారత్, స్వచ్ఛాంధ్ర ఎక్కడా కనబడుట లేదని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పి.నిర్మల విమర్శించారు. 18వ వార్డులో కనపడని పరిశుభ్రత, అనారోగ్యంతో ప్రజలు పట్టించుకోని టిడిపి కూటమి ప్రభుత్వం, మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.నిర్మల డిమాండ్ చేశారు. సిపిఎం ఓల్డ్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం జోహారాపురం18వ వార్డు సిపిఎం శాఖ కార్యదర్శి నాగరాజు అధ్యక్షతన నాయకులు పర్యటించారు. పి. నిర్మల, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు విజయ రామాంజనేయులు వార్డు పర్యటనలో వారి దష్టికి వచ్చిన సమస్యలపై మాట్లాడారు. జొహరాపురం18వ వార్డులో మున్సిపల్ కార్మికులు చాలా పరిమితంగా ఉన్నారని, చెత్తను తరలించే ఆటోలు లేవని, ఎక్కడ చెత్త అక్కడే దిబ్బలుగా ఉండి పందులకు, కుక్కలకు నిలయంగా మారిందని అన్నారు. తప్పెటగేరి, సుంకులమ్మ టెంపుల్ ఏరియాలలో మురుగుకాలువలు నిండిపోయాయన్నారు. రోడ్లపై చెత్త వేయడం వలన ఈగలు,దోమలు విపరీతంగా పెరిగాయని, దుర్వాసన వెదజల్లు తున్నా పట్టించుకునే పరిస్థితి లేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం కొత్త పెన్షన్ మంజూరు చేయకపోవడం వలన చాలామంది వృద్ధులకు వితంతువులకు పెన్షన్లు రానందున ఎలా బతకాలని ప్రశ్నిస్తున్నారని తెలిపారు. కేంద్రంలో బిజెపి అధికారం చేపట్టిన తర్వాత పెరిగిన ధరల కనుగుణంగా మాకు ఆదాయం లేకపోవడం, పనులు దొరకపోవడం వలన బతకలేకపోతున్నామని తెలిపామన్నారు. కేంద్రం బిజెపి ప్రభుత్వం స్వచ్ఛ భారత్ పేరుతో ప్రజల సొమ్మును దుర్వినియోగం చేస్తూ కేవలం ప్రచారానికి పరిమితమైందని విమర్శించారు. రాష్ట్ర కూటమి ప్రభుత్వం స్వచ్ఛంధ్ర, స్వర్ణాంధ్ర పేర్లు పలకడం తప్ప రాష్ట్రంలో ఉండే ప్రజల పరిస్థితి దరిద్రాంధ్రగా ఉన్నా పట్టించుకునే పరిస్థితి లేదని విమర్శించారు. అధికారులు స్పందించి సమస్యలన్నింటినీ పరిష్కరించాలనఆనరు. లేదంటే ప్రజలను సమీకరించి ప్రభుత్వంపై పోరాటం చేస్తామని హెచ్చరించారు. సిపిఎం స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పేరుకుపోయిన చెత్తను పరిశీలిస్తున్న పి.నిర్మల తదితరులు

ఇందిరాగాంధీ నగర్‌లో చెత్తకుప్పలను తొలగించండి

కర్నూలు కార్పొరేషన్ పరిధిలోని 43వ వార్డు ఇందిరాగాంధీ నగర్ లో గుట్టలుగా పేరుకుపోయిన చెత్త కుప్పను తొలగించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టి.రాముడు డిమాండ్ చేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యల పర్యటనలో భాగంగా 43వ వార్డు ఇందిరాగాంధీ నగర్‌లో పార్టీ నగరకమిటీ సభ్యులు ఎం.భాస్కర్ అధ్యక్షతన పరిశీలించారు. గుట్టల పేరుకుపోయిన చెత్త కుప్పను నెలలు గడుస్తున్నా తీయని డ్రెయినేజీ కాలువలను పరిశీలించి స్థానిక ప్రజలతో మాట్లాడారు. ప్రజలు అనేక విషయాలు వారు ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి సిపిఎం నాయకులకు ప్రతినిధి బృందానికి చెప్పారు. టి .రాముడు మాట్లాడుతూ ఇందిరాగాంధీ నగర్ లో రెండు కుళాయిల దగ్గర రైల్వే ట్రాక్ పక్కన గుట్టల పేరుకుపోయిన చెత్తకుప్పని తొలగించాలని అధికారులకు అనేక మార్లు వివరించినా, వినతి పత్రాలు ఇచ్చినా ఎలాంటి కదలిక రాలేదని అన్నారు. వెంటనే అధికారులు స్పందించి చెత్తను తొలగించాలన్నారు. నెలల తరబడి డ్రెయినేజీ కాలువలో సిల్టు తీయకపోవడం వల్ల దోమలతో, పురుగులతో, తేళ్ళతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కమిషనర్ వెంటనే సమస్యలపై స్పందించాలన్నారు.

కర్నూలు హాస్పిటల్ : కల్లూరు అర్బన్ శరీన్ నగర్ లో సమస్యలు తిష్ట వేశాయని వాటిని పరిష్కరించాలని సిపిఎం నాయకులు ఏసు రాజు డిమాండ్ చేశారు. 30 వార్డులో సిపిఎం ప్రజా సమస్యల పైన పర్యటించిన సిపిఎం బృందం దృష్టికి అనేక సమస్యలు ప్రజలు తీసుకువచ్చారు.

చెత్త దిబ్బలను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

కిలో టమోటా రూ.25 కొనుగోలు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి-పత్తికొండ

టమోటా రైతుల నుండి కిలో రూ.25 తో కొనుగోలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ డిమాండ్ చేశారు. ఆదివారం పత్తికొండ వ్యవసాయ మార్కెట్ లోని సిపిఎం మండల కార్యదర్శి చక్రాల వెంకటేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ టమోటా వేలం పాటలను పరిశీలించారు. వ్యాపారస్తులు రైతుల నుండి కిలో రూ.2 , రూ.3 తో కొనుగోలు చేస్తూ రైతులను మోసం చేస్తున్నారన్నారు. మార్కెట్ స్పెషల్ ఆఫీసర్ పద్మావతి దృష్టికి తీసుకెళ్లి రైతులకు గిట్టుబాటు ధర అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మార్కెట్ సెక్రెటరీ పద్మావతి సానుకూలంగా స్పందిస్తూ తక్కువ ధరకు కొనుగోలు చేసిన వ్యాపారస్తులకు పిలిచి రైతులకు కిలో రూ.8 కి డబ్బు చెల్లించాలని, లేకుంటే లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. సిపిఎం కృషి వల్ల రైతులకు గిట్టుబాటు ధర లభించిందని రైతులు సంతోషం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో కిలో రూ.25 తో కొనుగోలు చేయాలని లేని పక్షంలో రైతులను కలుపుకొని ఆందోళన చేయబడతామని హెచ్చరించాలి. సిపిఎం రంగారెడ్డి, గంగన్న, రవిచంద్ర, కాసి, మధు, లక్ష్మన్న పాల్గొన్నారు.

మార్కెట్ అధికారికి ధరల పట్టిను చూపుతున్న గౌస్‌దేశాయ్

హమాలీలను పట్టించుకోవాలి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

మార్కెట్‌లో హమాలీలను పట్టించుకోవాలని ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ యార్డ్ సూపర్వైజర్ ఎర్రి స్వామికి ఐఎఫ్‌టియు నాయకులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డ్‌లో పనిచేస్తున్న హమాలీలను ఉద్దేశించి ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి ఎస్.బాలరాజు మాట్లాడుతూ హమాలీలకు సంవత్సరానికి రెండు జతలు యూనిఫామ్‌లు ఇవ్వాలని, ఈఎస్ఐ, పిఎఫ్ వంటి సౌకర్యం కల్పించాలని, 60 సంవత్సరాల నిండిన అమాలికి పింఛను రూ.8 వేలు ఇవ్వాలని, కమిషన్ ఏజెంట్ దగ్గర పనిచేస్తున్న హమాలీలకు ప్రమాదవశాత్తు ఏమైనా జరిగిన కమిషన్ ఏజెంట్ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. హమాలీల లైసెన్లు రెన్యువల్ చేయాలని, లైసెన్స్ లేనివారికి కొత్త లైసెన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు పట్టణ కార్యదర్శి ఎస్ బాబు, నాయకులు మల్లికార్జున, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి సత్యన్నా, పెద్ద రెడ్డి, వీరేషు, స్వామి, బాష తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

- ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్

ప్రజాశక్తి కర్నూలు హాస్పిటల్ : ఆటో డ్రైవర్ సేవలో పథకం ఈనెల 4న ప్రారంభోత్సవం సందర్భంగా ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీని ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని ఎపి ఆటో అండ్ ట్రాలి డ్రైవర్స్ యూనియన్ సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కల్లూరు మండల ఉలిందకొండ గ్రామ ఆటో డ్రైవర్ల విస్తృత స్థాయి జనరల్ బాడీ సమావేశం ఆటో యూనియన్ సిఐటియు మండల కార్యదర్శి జి.మధు అధ్యక్షతన ఉలిందకొండలోని కార్మిక భవన్‌లో నిర్వహించారు. కె. ప్రభాకర్ ,కె.మధు మాట్లాడారు. ఈ నెల 4న విజయవాడలో డ్రైవర్ల సేవలో పథకం ప్రారంభిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆటో డ్రైవర్లను ఉద్దేశించి మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు ఉచిత బస్సు ప్రయాణం వల్ల నష్ట పోతున్న వారిని ఆదుకుంటామని, అందులో భాగంగానే భారీ జరిమానాలు విధించే జీవో నెంబర్ 21 రద్దు చేస్తామని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని, ప్రైవేటు యాప్లకు దీటుగా ప్రభుత్వమే ప్రత్యేక యాప్ తీసుకొచ్చి ఆటో డ్రైవర్లే నడుపుకునే విధంగా చేస్తానని అనేక వాగ్దానాలు చేశారని అన్నారు. చేసిన వాగ్దానాలను వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉచిత బస్సు వల్ల నష్టపోతున్న డ్రైవర్లను ప్రభుత్వం ఏవిధంగాను ఆదుకోలేకపోయిందని, కేవలం రూ.15000 మాత్రమే ఇచ్చి ఎంతో చేశానని ప్రభుత్వం గొప్పలు చెబుతుందన్నారు. ఇప్పుడున్న వాహన మిత్ర పథకాన్ని రూ.30 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. సిఐటియు సుదీర్ఘ పోరాటాల ఫలితంగా సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం వాగ్దానం చేసిందని వారన్నారు. వాగ్దానాల అమలు పై పోరాటాలకు సిద్ధం కావాలని ఆటో కార్మికులను కోరారు. సమావేశంలో ఉలిందకొండ ఆటో యూనియన్ నాయకులు బొగ్గులబాష, నరేష్, శేఖర్, సుంకన్న, నవీన్, వెంకటేష్, శీను, గొరంట్ల, దస్తగిరి, నాగయ్య, ఆటో డ్రైవర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

స్కేటింగ్‌లో మేటి కర్నూలు

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్ : కర్నూలు బి క్యాంపు ఖానా ఖజానా రోడ్డులో రెండు రోజుల పాటు జరిగిన జిల్లాస్థాయి స్కేటింగ్ పోటీల్లో పలువురు క్రీడాకారులు చక్కటి ప్రతిభ కనబరిచి మెడల్ సాధించారు. ఆదివారం పోటీల అనంతరం విజేలతకు మెడల్స్ వేసి సత్కరించారు. ముఖ్య అతిథులుగా మాజీ కార్పొరేటర్ సురేంద్ర, ఇండస్ పాఠశాల సిఇఒ విల్సన్ అగస్టిన్, రోడ్ రేస్ లో పతకాలు సాధించిన వారికి మెడల్స్‌తో సత్కరించారు. రింక్ రేస్‌లో గెలుపొందిన వారికి జిల్లా రోలర్ స్కేటింగ్ జిల్లా సంఘం సహాయక కార్యదర్శులు ఎ.పునీతచౌదరి, అనూష, సభ్యులు స్రవంతి రోలర్ స్కేటింగ్ సంఘం సిఇఒ పి. సునీల్ కుమార్ మెడల్స్ బహూకరించారు. ఈ పోటీలు రోడ్ రేస్‌లు అన్నీ ఖజానా లోని రోడ్డులో నిర్వహించారు. రింక్ రేసులను ఇండస్ ఇంటర్నేషనల్ స్కూల్ పాఠశాల లో నిర్వహించారు. పోటీలు ముగిసిన తరువాత క్రీడాకారులకు బహుమతి ప్రదానం చేశారు. స్కేటింగ్ జిల్లా సంఘం కార్యదర్శి అబూబకార్, కోచ్ రెఫ్రీలు యశ్వంత్ రెడ్డి , శామ్యూల్ రెనాల్డ్, ఇండస్ పిఇటి సురేష్, రాష్ట్ర రోలర్ స్కేటింగ్ పర్యవేక్షకులుగా పవన్ కళ్యాణ్ వ్యవహరించారు. కార్యక్రమంలో పలువురు క్రీడాకారులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజి ప్రైవేటీకరణ ఆపాలి

- డివైఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్ : ఆదోని మెడికల్ కాలేజ్ ప్రైవేటీకరణ వెంటనే ఆపాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆదోని మండల కమిటీ సమావేశం మండల నాయకులు శ్రీకృష్ణ అధ్యక్షతన సూపర్ బజార్ లోని సిఐటియు కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర మాట్లాడారురాష్ట్ర ప్రభుత్వం పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్షిప్ పేరుతో ప్రజల సొమ్మును ప్రజల ఆస్తులను కారు చౌకగా కార్పొరేట్ కంపెనీలకు ఇవ్వడం పనిగా పెట్టుకుందని విమర్శించారు.దేశంలోని ప్రతి పౌరునికి ఉచిత విద్య,వైద్యం అందించాలని రాజ్యాంగం చెబుతున్నప్పటికీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటివరకు నిర్లక్ష్యం చేశాయని అన్నారు. గత ప్రభుత్వం మెడికల్ కళాశాల నిర్మించి 50 శాతం సీట్లు అమ్ముకోవడానికి అవకాశం కలిగిస్తే దానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున తెలుగుదేశం ప్రభుత్వం పోరాడిందని అనేక సభలు పెడుతూ ప్రచారం చేసిందని అన్నారు..తెలుగుదేశం ప్రభుత్వం నేడు అధికారంలో ఉండి మెడికల్ కళాశాలలు ప్రైవేట్ పరం చేయడం అంటే రాజ్యాంగ హక్కులను తుంగలో తొక్కడమేనని మరోసారి ప్రజలను మరోసారి ప్రజలను మోసం చేయడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. మెడికల్ కళాశాల ద్వారా ఉచిత వైద్య విద్య, మంచి వైద్య సదుపాయాలు వచ్చే అవకాశం ఉందని దాని ద్వారా వెనకబడిన ఆదోని అభివృద్ధి అయ్యే అవకాశం ఉందని అన్నారు. ఇలాంటి మెడికల్ కళాశాల ప్రైవేటుపరం చేస్తున్న కూటమి ప్రభుత్వ విధానానికి వ్యతిరేకంగా ప్రజలు,ప్రజా సంఘాలు మేధావులు పెద్ద ఎత్తున పోరాటం చేయాలని విజ్ఞప్తి చేశారు. జీవో నెంబర్ 107,108 రద్దు చేయాలని పిపిపీ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేద్దామని హెచ్చరించారు. సమావేశంలో డివైఎఫ్ఐ మండల కన్వీనర్ బీసీ వీరేష్, నాయకులు గర్జప్ప, హుస్సేన్, రమేష్ పాల్గొన్నారు.

-మాట్లాడుతున్న డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవవేంద్ర

ప్రజల మనిషి శేషయ్య

వర్ధంతి సభలో వక్తలు

ప్రజాశక్తి కర్నూలు క్రైమ్

ప్రజల మనిషి బాలోత్సవ మాజీ ప్రధాన కార్యదర్శి జెఎన్ శేషయ్య అని పలువురు వక్తలు అన్నారు. ఆదివారం కర్నూలు లలిత కళా సమితిలోని మినీ హాల్లో వర్ధంతి సభను బాలోత్సవ కమిటీ జిల్లా అధ్యక్షులు రఘుబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా శేషయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ముఖ్య అతిథులుగా రవీంధ్ర విద్యాసంస్థల అధినేత జి పుల్లయ్య, ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి.శంకర్ శర్మ, క్లస్టర్ యూనివర్సిటీ డీన్ అక్తర్ భాను, ప్రముఖ ఎకనామిస్ట్ మన్సూర్ రెహమాన్, బాలోత్సవ కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి ధనుంజయ హాజరై మాట్లాడారు. శేషయ్య నిరంతర సామాజిక శ్రామికుడని, సమాజ హితం కోసం అప్పగించిన ఏ పనినైనా సాధించే దీక్షాపరుడన్నారు. పట్టుదల తపన, అంకితభావం దృఢమైన సంకల్పానికి ప్రతీక ఆయన అని అన్నారు. వయసుకు సంబంధం లేకుండా బాలల ఉత్సవంలో బాలుడై వ్యవహరించేవారని అన్నారు. అది సామాజిక పని అయినా వ్యక్తుల పని అయినా స్నేహశీలభావంతో సహాయ సహకారాలు అందించే వారన్నారు. నిస్వార్థపరుడుగా వ్యవహరించాడన్నారు. ఆయన అకాల మరణానికి గురి కావడం ఎంతో బాధాకరమన్నారు. ఆయన స్ఫూర్తితో బాలోత్సవ కమిటీ మరిన్ని సేవా కార్యక్రమాలను సృజనాత్మక, స్ఫూర్తి కార్యక్రమాలను బాల బాలికల్లోకి తీసుకువెళ్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బాలోత్సవ కమిటీ నాయకులు రంగస్వామి, బసవరాజు, జయరాజు, ఎలమర్తి రమణయ్య, పాండురంగయ్య, బీడీ సుధీర్ రాజు, రమాదేవి, వెంకటస్వామి, హేమంత్, రామకృష్ణ, ఎల్లాగౌడు, మునిస్వామి, చంద్రమోహన్, అబ్దుల్లా, సాయి, ఆర్య, నాగరాజు రామచంద్, తదితరులు పాల్గొన్నారు.

శేషయ్యకు నివాళి అర్పిస్తున్న పుల్లయ్య, శంకర్‌శర్మ, రఘుబాబు తదితరులు

గ్రామ సేవకుల మహా ధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-ఆదోని రూరల్

విజయవాడలో ఈనెల 15వ తేదీన జరుగు గ్రామ సేవకుల మహాధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.డి.అంజిబాబు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గ్రామ సేవకుల సంఘం గౌరవ అధ్యక్షులు బి.రామాంజనేయులు కోరారు. విజయవాడలో ఈనెల 13 14 తేదీలలో దీక్షలు 15వ తేదీన మహా ధర్నా జయప్రదం కొరకు ఆదోని సిఐటియు కార్యాలయం దగ్గర గ్రామ సేవకుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మల్లయ్య అధ్యక్షతన విసత సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ పే స్కేల్ అమలు చేయాలని కోరారు నైట్ డ్యూటీ లను రద్దు చేయాలని డిఏలను జీతం లో కలపాలని నామినీ లను వీఆర్ఏలుగా గుర్తించాలని కోరారు వీఆర్వో అటెండర్ వాచ్మెన్ రికార్డ్ అసిస్టెంట్ తదీతర పోస్టులలో 70 శాతం వీఆర్ఏలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధన కొరకు జరుగుతున్న ఆందోళనలో వీఆర్ఏలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో కోసిగి మండలం నాయకులు రాజు శాంతి రాజు కౌతాళం మండల నాయకులు నాగరాజు పెద్ద కడుబూరు మండల నాయకురాలు హైమావతి గోనెగండ్ల మండలం నాయకులు రంగన్న అలాగుంద మండల నాయకులు తిక్కప్ప పాల్గొన్నారు

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు

మొరాయించిన ఆర్‌టిసి బస్సు...

మరో బస్సు వచ్చే వరకు ప్రయాణికుల పడిగాపులు

ప్రజాశక్తి-సి బెళగల్

సి బెళగల్ కు రోజు రాత్రి పదిన్నర గంటలకు చివరి బస్సుగా వచ్చి నిద్రిస్తుంది. అదే బస్సు ఉదయం ఐదు గంటలకు కదిలి కర్నూలుకు ఏడు లోపు చేరుకుంటుంది. అయితే శనివారం రాత్రి నైట్‌హాల్ట్ బస్సు ఆదివారం ఉదయం మొరాయించింది. ఉదయమే లేచి సూదురా ప్రాంతాలకు, వేడుకలకు, పెళ్లిళ్లకు, ఇతర అవసరాలు తీర్చుకొనేందుకు ప్రజలు, ప్రయాణికులు సి బెళగల్ కేంద్రానికి అధిక సంఖ్యలో చేరుకుంటారు. అనుకున్న వేళకు వెళ్లి తిరిగి అనుకున్న సమయానికి గమ్యం చేరుకొని యాదవిధిగా పనులలో నిమగ్నం అవుతుంటారు. ఇక్కడే చిరు వ్యాపారులు కూడా ఎందరో ఉన్నారు. ఉదయం వేళ ఇలా బస్సు కదలక ఉండి పోవడంతో తిరిగి మరో బస్సు కోసం పడిగాపులు కాయల్సివచ్చింది. ఎమ్మిగనూరు నుండి సిబెళగల్ మీదుగా మొదటి బస్సు ఇదే.. ఈ వేళకు మరో బస్సు లేదు. మరో బస్సు ఎమ్మిగనూరు నుండి కర్నూలుకు వెళ్తూ సిబెళగల్ కు ఆరున్నర గంటలకు వస్తుంది. కానీ కాలం చెల్లిన బస్సులు వేయడం వలన పలుమార్లు ఇలా అవస్థలుపడుతున్నారని ప్రభుత్వం దృష్టి సారించి కండిషన్ గల బస్సులు వేయాలని అందుకు ఆర్టీసీ అధికారులు కూడా శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందని ప్రజాసంఘాలు , ప్రయాణికులు, ప్రజలు అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

బతుకు దెరువు కోసం ...

- పొట్టకూటి కోసం పట్టణాలకు -వలసలతో ఖాళీ అవుతున్న పల్లెలు

ప్రజాశక్తి-కోసిగి

రైతు ఈ నేలపై నాగలి పట్టాకే నాగరికత మొదలైంది. దేశానికి అన్నం పెట్టే రైతన్న నేడు వలస కూలీగా మారుతున్నాడు. ప్రకృతి వైపరీత్యాల వల్ల అతివృష్టి వచ్చినా.. అనావృష్టి వచ్చినా.. ఎటు తిరిగినా రైతు నష్టపోవాల్సిందే. పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక వలస బాట పడుతు న్నారు. పట్టణాల్లో దినసరి కూలీలుగా మారు తున్నారు. అన్నం పెట్టే రైతన్న అపార్టు మెంటులో వాచ్మెన్‌గా పనిచేస్తున్నాడు. పంటకు తెచ్చిన అప్పులు తీర్చలేక పిల్ల పాపలతో కలిసి సుదూర ప్రాంతాలకు వలస వెళుతున్నారు...

గత వారం రోజుల నుంచి కోసిగి మండలంలో కోసిగి, సజ్జలగూడెం, జంపాపురం, దుద్ది, కోల్మన్ పేట, కామన్ దొడ్డి, దొడ్డిబెళగల్ , పల్లెపాడు, చింతకుంట, నేల కోసిగి, వందగల్లు తదితర గ్రామాల్లో వేలాదిమంది వలస బాట పట్టారు. ఎక్కడ చూసినా గ్రామాలు నిర్మానుష్యంగా మారాయి. ఏ గ్రామానికి వెళ్లినా ఏ వీధికి వెళ్ళినా తాళం వేసిన తలుపులే కనబడతాయి. స్థానికంగా పనులు లేకపోవడం అదే విధంగా వేరే పట్టణాలకు వలస వెళ్తే అక్కడ పిల్లాపాపలతో కలిసి కుటుంబమంతా పని చేసుకుని కొంత డబ్బు వెనకేసుకుని సాగుకోసం తెచ్చిన అప్పులను తీర్చుడానికి వెళుతున్నారు. మండలం నుంచి తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలకు వందలాది వాహనాల్లో మూట ముల్లె సర్దుకుని వల్ల వెళుతున్నారు. ప్రభుత్వాలు మారిన ఇంతవరకు మండల ప్రజల తలరాత మారడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పదేపదే నాయకులు వచ్చి ఆదుకుంటామని చెబుతారే తప్ప ఇంత వరకు కోసిగిలో స్థానికంగా దాదాపు పదివేల మందికి ఉపాధి కల్పించే విధంగా చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేస్తే బాగుంటుందని మండల ప్రజలు కోరుతున్నారు. అదేవిధంగా చిన్న సన్నకారు రైతులు పంట ఉండే మరి కొంతమంది రైతులు పక్కనే ఉన్న కర్ణాటక రాష్ట్రం రాయచూరుకు ప్రతిరోజు రైలులో వెయ్యి మంది కూలీగా పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇప్పటికే మండలం నుంచి వెయ్యి కుటుంబాలకు పైగానే వలస వెళ్లాయి. జిల్లా రాష్ట్రస్థాయి అధికారులు, నాయకులు స్పందించి మండలాన్ని కరువు మండలంగా గుర్తించి స్థానికంగా ఉపాధి కలిగించే విధంగా ఆలోచనలు చేయాలని కోరుతున్నారు.

కోసిగి నుంచి ఊరు వదిలి వలస పోతున్న కూలీలు

అప్పులు తీర్చడానికి వలసలు

- లక్ష్మి, వలస కూలీ, కోసిగి

పంట కోసం చేసిన అప్పులు తీర్చడానికి వలస వెళ్తున్నాం. ఏడాది పత్తి పంట సాగు చేశాం. అధిక వర్షాల వల్ల పత్తి పంట పూర్తిగా దెబ్బతినింది. పంట కోసం తెచ్చిన అప్పులు తీర్చడానికి పిల్లాపాపలతో కలిసి తెలంగాణ రాష్ట్రానికి వలస వెళుతున్నాం. ఇక్కడే ఉంటే మరింత అప్పు అయ్యే అవకాశం ఉంది. మా కుటుంబంలో దాదాపు 20 మంది వెళుతున్నాం.

పరిశ్రమలు ఏర్పాటు చేయాలి

- నరసింహులు, కోసిగి

ప్రతి ఏడాది కోసిగి మండలం నుంచి దాదాపువేలమంది ఇతర రాష్ట్రాలకు వలస వెళుతుంటారు. ఇక్కడ పనులు లేవు..పండించిన పంటకు గిట్టుబాటు ధర లేదు. ప్రతి ఏడాదివలస వెళుతుంటాం.అధికారులు , నాయకులు స్పందించి ఒక పెద్ద పరిశ్రమ ఏర్పాటు చేస్తే కొంతవరకు వలసలను అరికట్టవచ్చు.

అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

- టిడిపి కన్వీనర్ లాయర్ షేక్షావలి, సాగునీటి సంఘం అధ్యక్షులు కిష్టప్ప

ప్రజాశక్తి-చిప్పగిరి

అభివృద్ధి, సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని టిడిపి కన్వీనర్ లాయర్ షేక్షావలి, సాగునీటి సంఘం అధ్యక్షులు నగరడోన కిష్టప్ప తెలిపారు. ఆదివారం మండల కేంద్రమైన చిప్పగిరిలో కన్వీనర్ షేక్షావలి ఆధ్వర్యంలో బూత్ ఇన్చార్జిలకు సభ్యత్వ కార్డుల బాక్స్‌లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ యాదవ్ ఆదేశాల మేరకు సభ్యత్వ కార్డులను కార్యకర్తలకు అందజేయడం జరుగుతుందన్నారు. సభ్యత్వ కార్డు పొందిన ప్రతి కార్యకర్తకి అన్ని రకాలుగా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కొండా పురుషోత్తం, బంటన హాల్ సురేష్ , పాములు సన్నప్ప, బెల్డోన గోవిందు, కొండ రామాంజనేయులు, మీసాల రామాంజిని, పురుషోత్తం, తిమ్మయ్య, పులికొండ, చంద్ర, మేకల రామాంజనేయులు, హరినాథ్, శ్రీనివాసులు, అశోక్, వీరాంజనేయులు, మాధవులు పాల్గొన్నారు.

సభ్యత్వ కార్డులు అందజేస్తున్న నాయకులు

నియోజకవర్గంలో అక్షరాస్యత శాతం పెంచాలి

-అత్యధిక ఉపాధ్యాయుల బాధ్యతలతో రికార్డు

-బాధ్యతలు చేపట్టిన ఉపాధ్యాయులకు టిడిపి ఇంచార్జ్ ఎన్ రాఘవేంద్ర రెడ్డి సూచన

ప్రజాశక్తి-మంత్రాలయం

దేశంలోనే అక్షరాస్యత శాతంలో అత్యంత వెనుకబడిన మంత్రాలయం నియోజకవర్గానికి అత్యధికంగా ఉపాధ్యాయ పోస్టులను కేటాయించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి టిడిపి నియోజకవర్గ ఇంచార్జ్ ఎన్ రాఘవేంద్ర రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో అక్షరాశ్యత శాతం పెంచే దిశగా నూతనంగా బాధ్యతలు చేపడుతున్న ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. నియోజకవర్గానికి 727 మంది నూతన ఉపాధ్యాయులు కేటాయించిన పాఠశాలలో విధులకు హాజరు కానున్నారని వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయుల కొరత ఉందని నాడు విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే సానుకూలంగా స్పందించి ఎక్కువ పోస్టులను కేటాయించారని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని మంత్రాలయం మండలానికి 121 మంది, కోసిగి మండలానికి 256 మంది, కౌతాళం మండలానికి కు 257 మంది, పెద్దకడుబూరు మండలానికి 92 మంది ఉపాధ్యాయులను కేటాయించారన్నారు. బాధ్యతలు స్వీకరించేందుకు నియోజకవర్గంలో అడుగు పెడుతున్న ఉపాధ్యాయులకు స్వాగతం పలికారు.

జన సంద్రంగా శ్రీ రాఘవేంద్రస్వామి మఠం

ప్రజాశక్తి-మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమెన మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో శ్రీ మఠం భక్త జన సంద్రంగా మారింది. ఆదివారం రాఘవేంద్రస్వామి దర్శనార్థమై దేశంలో ఉన్న వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొనేందుకు బారులు తీరారు. స్వామి వారికి ప్రత్యేక సేవలు చేయించిన భక్తుల సమక్షంలో రాఘవేంద్రుని బృందావన ప్రతిమకు శ్రీ మఠం దివాన్ శ్రీనాథాచార్ విశేష పూజలు నిర్వహించి మంగళ హారతులు ఇచ్చారు. అనంతరం సేవాదారులకు ఫల మంత్రాక్షతలు అందజేసి ఆశీర్వదించారు.

ఘనంగా స్వామి వారి స్వర్ణ పల్లకోత్సవం

స్వామి వారి స్వర్ణపల్లకోత్సవం ఘనంగా నిర్వహించారు. స్వర్ణ పల్లకి సేవ చేయించిన భక్తుల సమక్షంలో రాఘవేంద్రుని బృందావన ప్రతిమకు విశేష పూజలు నిర్వహించి మంగళ హారతులు ఇచ్చిన శ్రీ మఠం దివాన్ శ్రీనాథాచార్ ఆధ్వర్యంలో బృందావన ప్రతిమను స్వర్ణ పల్లకిలో ఉంచి మేళ తాళాలు మంగళ వాయిద్యాల నడుమ శ్రీ మఠం ప్రాకారంలో ఘనంగా పల్లకోత్సవం నిర్వహించారు.

STATE TEAC RS UNION A.P
STU AP
మాట్లాడుతున్న జిల్లా అదనపు కార్యదర్శి ఎంసి సుంకన్న

ఉపాధ్యాయునిపై దాడి అమానుషం

ప్రజాశక్తి - ఆదోని

ఉపాధ్యాయులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఎస్‌టియు జిల్లా అదనపు కార్యదర్శి ఎంసి సుంకన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదోనిలోని వారి కార్యాలయంలో ఆదోని, కౌతాళం నాయకులతో కౌతాళం మండల ఉపాధ్యక్షుడు అంజనయ్య అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గోనెగండ్ల మండలం గాజులదిన్నె గ్రామంలో బసవరాజు అనే ఉపాధ్యాయుడిపై విద్యార్థి తండ్రి రంగస్వామి దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. ఇలాంటి వారిపై పోలీసులు కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు రక్షణ లేకుండా పోతుందని, మహిళా ఉపాధ్యాయులు సైతం ఇలాంటి సంఘటనతో ఇబ్బంది పడే అవకాశం ఉందన్నారు. సమావేశంలో ఎస్‌టియు జిల్లా ఆర్థిక కమిటీ సభ్యుడు బి. రామాంజనేయులు, ఆదోని మండలం ఆర్థిక కార్యదర్శి పి. షేక్షావలి, సీనియర్ నాయకులు సుధాకర్, వేణుగోపాల్, లక్ష్మన్న, రాజానాయక్, శ్రీకాంత్ రెడ్డి, వెంకట్రాముడు పాల్గొన్నారు.

SUGUR KARANAM
SJB
క్రీడా దుస్తులు పంపిణీ చేస్తున్న ప్రదీప్‌రెడ్డి

క్రీడాకారులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - మంత్రాలయం

క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తన వంతు సాయంగా వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు వై ప్రదీప్ రెడ్డి క్రీడాకారులకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. మాధవరం తాండ గ్రామంలో ఆదివారం నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. క్రీడలు క్రీడాకారుల మధ్య స్నేహ సంబంధాలు పెరుగుతాయని తెలిపారు. క్రీడల వల్ల మానసిక ఉల్లాసం, దేహ దారుఢ్యం పెరుగుతుందని చెప్పారు. క్రీడల ప్రోత్సాహకానికి రాంపురం రెడ్డి సోదరులు ఎప్పుడూ ముందుంటారని గుర్తు చేశారు. కార్యక్రమంలో వైసిపి మండల ఇన్‌ఛార్జి సివి విశ్వనాథ్ రెడ్డి, సివి కాంతరెడ్డి, సూగూరు కరణం, గోపీ స్వామి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల నిర్మాణంలో అలసత్వం

- అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా పూర్తికాని సచివాలయాలు

ప్రజాశక్తి - నందవరం

ప్రజల సంక్షేమం కోసం అన్ని శాఖలకు సంబంధించిన సేవలను గ్రామంలోని అందించాలన్న సంకల్పంతో గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సచివాలయ వ్యవస్థను నెలకొల్పింది.వ్యవస్థకు సరిపడే విధంగా సచివాలయాలను మాత్రం నిర్మించలేకపోయింది. తరవాత ఏర్పడిన కూటమి ప్రభుత్వమైతే సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసింది. మండల పరిధిలోని కొన్ని గ్రామాలలో నూతన సచివాలయాలు అందంగా రూపుదిద్దుకున్నాయి. నందవరంలో మాత్రం ఒక్కటి కూడా పూర్తి కాలేదు. 40 లక్షల వ్యయంతో రెండు సచివాలయాల నిర్మాణలను గత ప్రభుత్వం చేపట్టి నిర్మాణం చివరి దశలో నిలిపివేసింది.వాటిని పూర్తి చేయటానికి ప్రస్తుత ప్రభుత్వం మొగ్గు చూపడం లేదు. గత ప్రభుత్వం పంచాయతీ కార్యాలయం, సొసైటీ కార్యాలయం, పాత తహసిల్దార్ ఆఫీస్‌లను 3 సచివాలయాలుగా మార్చింది.పంచాయతీ కార్యాలయాన్ని కేటాయించడం వలన గ్రామ పాలకులు, సచివాలయ సిబ్బంది ఇద్దరు ఇబ్బందులు పడుతు చిన్న కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు. సొసైటీ కార్యాలయంలో ఉన్న సచివాలయాన్ని కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఖాళీ చేయించారు. గత్యంతరం లేక పాత తహసిల్దార్ కార్యాలయంలో వారిని కూడా అధికారులు తీసుకొచ్చిపెట్టారు. ప్రస్తుతానికి ఇప్పుడు పాత తహసిల్దార్ ఆఫీస్‌లో రెండు సచివాలయాలను నిర్వహిస్తున్నారు. రెండు ఒకే చోట ఉండడం వలన నిత్యం నెట్వర్క్ సమస్యలు, కార్యాలయం ఇరుకుగా ఉండడంతో సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. 14 వేల జనాభ కలిగిన గ్రామానికి సరైన సచివాలయ వ్యవస్థ లేకపోవడం ఏమిటని ప్రజలు మండిపడుతున్నారు. తమ అవసరాలకి కార్యాలయాలకు వెళ్లలన్న చాలా దూరం నడుచుకుంటు వెళ్లాలని, చాలా సందర్భాలలో రద్దీ వలన రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరిగామని ప్రజలు తెలిపారు.మూడు సచవాలయాలను నిర్మించి గ్రామ ప్రజలకు ఉన్నతమైన సేవలను అందించాలని ప్రభుత్వాన్ని ప్రజలు కోరుతున్నారు. కట్టడం చివరి దశలో నిలిచిన సచివాలయాలు ఆసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారాయి.మల మూత్ర విసర్జన చేయటానికి, మందుబాబులు మద్యం సేవించడానికి అడ్డగా మారాయి.వివిధ కార్యాలయాల సిబ్బంది, ప్రజలు, వ్యాపారస్తులు భరించలేని కంపుతో ఇబ్బందులు పడుతున్నారు.

అసంపూర్తి సచివాలయ భవనం

ఇరుకు గదిలో నిర్వహన

ప్రభుత్వం నుండి అనుమతులు రాలేదు

- నరసింహులు, పిఆర్ ఏఈ, నందవరం మండలం.

మండలంలో 19 సచివాలయాలు ఉన్నాయి. గత ప్రభుత్వ హయంలో 12 పూర్తిగా నిర్మించి వినియోగంలోకి తీసుకొచ్చాము. 5 వివిధ నిర్మాణ దశలలో నిలిచాయి.మరో 2 నిర్మాణానికి పునాదులు కూడా వేయలేదు. నిలిచిన సచివాలయాల నిర్మాణానికి ప్రస్తుత కూటమి ప్రభుత్వం నుండి ఎటువంటి అనుమతులు రాలేదు.

సిఎం సహాయ నిధి పేదలకు వరం

ప్రజాశక్తి - కౌతాళం

సిఎం సహాయ నిధి పేదలకు వరంలా మారిందని, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని మంత్రాలయం ఇన్‌ఛార్జీ రాఘవేంద్ర రెడ్డి తనయుడు రాకేష్ రెడ్డి అన్నారు. కౌతాళం మండలం గుడికంబాలి గ్రామానికి చెందిన ములిగేరి పవిత్ర, ములిగేరి రవీంద్రలకు సిఎం సహాయ నిధి పథకం కింద మంజూరైఏన ఆర్థిక సహాయాన్ని ఆయన ఆదివలారం అందజేశారు. ములిగేరి పవిత్ర, రవీంద్ర ఆరోగ్య సమస్యలతో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందాడు. అనంతరం వైద్య ఖర్చుల సహాయం కోసం మంత్రాలయం టీడీపీ ఇన్‌ఛార్జీని సంప్రదించి సీఎం రిలీఫ్ ఫండ్‌కి దరఖాస్తు చేసుకోగా రూ.46000 మంజూరు అయ్యాయి. కాగా సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందేందుకు సహకారం అందించిన మంత్రాలయం ఇన్‌ఛార్జీకి వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గుడి కంబాలి మాజీ సర్పంచి గోపాల నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ క్రీడాకారునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి -ఎమ్మిగనూరు: ఎమ్మిగనూరుకు చెందిన ఫుట్‌బాల్ క్రీడాకారుడు బి.సిద్దు రోడ్డు ప్రమాదంలో గాయపడిన విషయం తెలిసిన ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బివి జయ నాగేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు బివి.యూత్ ఫుట్బాల్ అసోసియేషన్ అధ్యక్షులు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ వాల్మీకి రామకృష్ణ నాయుడు గాయపడిన క్రీడాకారుడికి చికిత్సకోసం రూ.5000 నగదు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. వాల్మీకి రామకృష్ణ నాయుడు, ఫుట్బాల్ కోచ్ మాబన్నలు మాట్లాడుతూ ఫుట్బాల్ క్రీడాకారుడు సిద్దు చికిత్స పొందేందుకు ఎమ్మెల్యే బివి జయ నాగేశ్వర రెడ్డి మానవతా దృక్పథంతో ముందుకు వచ్చారన్నారు. ఫుట్బాల్ క్రీడాకారుడు బి.సిద్దు అండర్ 19, అండర్ 20లో 2సార్లు నేషనల్స్‌కు ఆడారు. ఇలాంటి క్రీడాకారులు సమాజానికి గౌరవం తెస్తారన్నారు. వారిని ప్రోత్సహించడం మనందరి బాధ్యత అని తెలిపారు. క్రీడాకారుని కుటుంబ సభ్యులు, స్నేహితులు వంశీ, రాము, విజయ్‌లు ఎమ్మెల్యే బివి జయనాగేశ్వర రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి - ఆలూరు

ఆలూరు ప్రభుత్వ బాయ్స్-1ఉన్నత పాఠశాలలో చదువుకున్న 1997-1998 సం"రం పదవ తరగతి బ్యాచ్ ఘనంగా పూర్వపు విద్యార్థుల సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. ఉన్నత చదువులు చదివి స్థిరపడిన పూర్వపు విద్యార్థులు పేద విద్యార్థులకు చదువుకునేందుకు సహాయ సహకారాలు అందించినప్పుడే మన చదువుకు విలువ ఉంటుందని ఉపాధ్యాయులు రుక్మిణి, మహబూబ్ బాష, రమణయ్య అన్నారు. ముందుగా అప్పట్లో విద్యా బుద్దులు నేర్పిన ఉపాధ్యాయులు రుక్మిణి, రమణయ్య, మహబూబ్ సాహెబ్‌లను శాలువాలతో సత్కరించి షీల్డ్ అందజేశారు. విశ్రాంత ఉపాధ్యాయులు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి, పేద విద్యార్థుల చదువులకు సహాయ సహకారాలు అందించాలన్నారు. పాఠశాల ఆవరణలో జ్ఞాన సరస్వతి ఆలయం నిర్మించడం అభినందనీయమని చెప్పారు.

దేశాయ్ పూలమాలలు వేసి నివాళ్లు అర్పిస్తున్న నాయకులు

దేశాయ్ కృష్ణ ఆశయ సాధనకు కృషి : వైసిపి

ప్రజాశక్తి కౌతాళం

కీర్తిశేషులు దేశాయ్ కృష్ణ ఆశయాలను అందరూ కలిసి ముందుకు తీసుకెళదామని వైసిపి మండల కన్వీనర్ దేశాయి ప్రహ్లాద చారి కోరారు. కౌతాళం పార్టీ కార్యాలయంలో మూడవ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రహ్లాదాచారి మాట్లాడుతూ ప్రజా సేవకు అంకితమైన ఆయన మన మధ్య లేకపోవడం బాధాకరమైన, ఆయన ఆశయాలను నెరవేర్చడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. సర్పంచ్ పాల్ దినకరన్, వైస్ ఎంపిపి బుజ్జి స్వామి, ఉప సర్పంచ్ తిక్కయ్య, మాజీ సర్పంచి అవతారం, నాయకులు రాముడు అబ్దుల్ సమాద్, శ్రీకాంత్ ,ముఖన్న, బసవరాజ్ ,పూజారి లింగన్న, బాష, శ్రీరామ్ ,రాగప్ప ,నారాయణ ,రామకృష్ణ, సిద్ధ ఖాదర్ లింగ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్యే తనయుడి పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - నందవరం : వైసీపీ మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి తనయుడు ఎర్రకోట జగన్ మోహన్ రెడ్డి పుట్టినరోజు వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. నాగులదిన్నెకు చెందిన వైసిపి నాయకులు పివి రాజేష్ శెట్టి ఆయన నివాసానికి చేరుకుని శాలువా, పూలమాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు పి. ఈరన్న శెట్టి, కె. రామాంజనేయులు, రుద్రయ్య, నడిపి రాముడు, కోటేకల్ చాంద్, హుసేని గౌడ్ పాల్గొన్నారు.